అగ్నిపరీక్ష

శ్రీ మంథా వెంకటరమణారావు

మేము రోజూ అప్పారావుగారి ఇంట్లో కలుస్తూ వుండేవాళ్ళం, ఆ రోజులలో. పంచ పాండవులని అంటూ వుండేవారు మమ్మల్ని. మాష్టారు ధర్మరాజు: ఆయనకి 52 ఏళ్ళు అప్పుడు. పండి నిటారుగా నిల్చున్న జుత్తు. సర్వదా చిరునవ్వు ముఖం. నుదుటి మధ్యని చిన్ననాట ఎప్పుడో చుట్టతో పెట్టిన ట్రేడ్ మార్కు.

అప్పారావుగారు అర్జునులు: పొడుగాటి విగ్రహము. దానికి తగ్గ అంత పలచనూ అంత సన్నమూ కాని శరీరం—కళ్ళీ లాల్చీ—పంచ—గోల్డు ఫ్రేము కళ్ళద్దాలు. ఆయన అంతా పెద్దమనిషి ఫాయిలో వుండేవారు. రాసి ఏదో ఊడబొడిచేద్దామని తయారుచేసిన నాటికలు, కథలు ఆయనకు ప్రపథమంగా వినిపించేవారం నేనూ, కృష్ణమూర్తి. ఏదో అన్యమనస్కంగా వింటున్నట్టుండి, ఎవ్వరికీ తట్టని సూక్ష్మమయినవీ—అయినా పెద్దవీ—అయిన పొరపాట్లను పట్టి, బాణంలా సంధించికొట్టినట్టు విసిరేవారు మామీద. అప్పుడు ఆయన వయస్సు 42—మంచి చూపరి.

ఇంక నాయినప్ప: భీముడు. అతని అసలు పేరు ప్రసాదరావు. "భీముడు" సరిగా సరిపోయిందతనికి. మంచి బలమయిన శరీరం. వితండవాదం. సులభంగా ఆవేశాన్ని పొందగలిగే తత్వం. సహృదయుడు. అతని వయస్సు 36 అప్పుడు.

ఇంక కృష్ణమూర్తి: నకులుడు. అతను కవేగాక రచయిత కూడానూ. అతని వయస్సు 32 అప్పుడు. మిగిలిన సహోదరుణ్ణి నేను. నా వయస్సు 22 అప్పుడు. మా ఇద్దరిలోనూ నకుల సహదేవుల గుణగణాలున్నా లేకపోయినా అక్కడికా ఐదు సంఖ్య సరిపోయింది కాబట్టి గత్యంతరం లేకపోయింది.

నాయినప్పని ఆవేశపరచడం కృష్ణమూర్తి పని. ఇద్దరూ కొట్టుకొనే వరకూ వచ్చేది. కృష్ణమూర్తి పాపం అర్భకుడు. అందుకక్కడితో ఆపేవాడు. ఇక నా సంగతి ఆట్టే రాసుకోనవసరం లేదు. చూస్తూ, వింటూ కూచొనేవాణ్ణి.

అయితే అసలు సంగతికి వద్దాం. అప్పారావుగారింట్లో కలుస్తూ వుండేవాళ్ళం అన్నాకదూ. అంతా చేరేక అక్కడ కాసేపు 'హస్కు' వేసి బయలుదేరి మెయిన్‌రోడ్డు మీదుగా నడుస్తూ పోయి, అప్ప ఇల్లు చేరడమో లేక దారిలో ఒకసారి కృష్ణయ్యర్ హోటలులో దూరి కాఫీ తాగుతూ ఈ మహావిశ్వాన్ని గురించి మాటాడ్డమో జరిగేది.

లేదా, ఒకోనాడు, మాష్టారు మాకు చక్కటి అనుభవాలు చెప్పేవారు. అంతా అయాక మా ఇద్దరినీ ఉద్దేశించి కథలుగా వ్రాయమనేవారు. ఓసారి ఆయన మాట తోసేలేక కథగా రాసానుకూడా ఒక అనుభవం. అది చాలా ఏళ్ళక్రితం లెండి—నిజానికి అవి ఆయన అనుభవాలుకావు. ఆయన కేవలం ఒక సాక్షి మాత్రుడు వాటికి—ఆ అనుభవం పొంది అందులోని పాత్రలయిన వ్యక్తులు వేరు. ఆయన చెప్పడంకూడా సొగసుగానే చెప్పేవారు—అదక్కడికలా ఉంచండి.

నాయనప్పని ఆవేశపరచడానికి ఒక సులభమయిన మార్గం ఉంది. అది: వాల్మీకి అనే మహర్షి రాసిన రామాయణం అనే గ్రంథాన్ని చర్చలోకి తీసుకరావటం—ఆ పని అప్పారావుగారే చేసేవారు—"అయితే—అప్పా!" అన్న సంబోధనతో ఆరంభించేవారు. అది ఇంక రాకెట్‌లా లేచి ఆకాశాన్నందుకునేది—అప్ప ఊహలో రామాయణం ఒక కల్లబొల్లి కట్టుకథ—అది అంతటితో ఆగినా బాగుణ్ణు—ఆ రాసినవాడొక బుర్రలేనివాడు—రాముడు ఒక చేతకాని చవట—అలా అలా సాగిపోయేది—పాతివ్రత్యం ఏమిటంటాడు—పతివ్రతలు లేరంటాడు—నభూతో నభవిష్యతి అంటాడు. ఈనాడేమన్నా పాతివ్రత్యం ఉంటే అది ఆర్థిక బానిసత్వంవల్లనే

అంటాడు—'చలం' గాలి సోకిందనేవారు అప్పారావుగారు—ఇంక ఆయనా ఆరంభించేవారు పూర్వపక్షం—పిలకలుపట్టుకు నేవరకువచ్చి అక్కడికి ధర్మరాజుగారి జోక్యంతో ఆగి, కాఫీ సేవించాక చల్లారేది.

అవి మార్చి రోజులు—ఆఫీసులో ఉపద్రవమయినపని—ఆ రోజున మరీనూ—ఇంటికి చేరుకొనే సరికి బాగా అలసిపోయేను—బాగా చీకటి కూడా పడింది. ఆకలి కూడా వేస్తూఉండేది-వెంటనే భోజనం చేసేను. ఇంక ఇంట్లో ఉండాలనిపించలేదు. మా ఇంటిపక్కనే మురికికాలవ—ఆ ఇంట్లో ఉండడం బాధే—ఆ రోజున మరీనీ—సినిమాకి పోదామని బుద్ధి పుట్టింది, నాదగ్గర ఒక రూపాయి మిగిలిఉంది. ఇక కావల్సింది మరో రూపాయిపావలా—అది కృష్ణమూర్తి పూర్తిచేస్తాడన్న నమ్మకం ఉంది. మేం ఎప్పుడూ బెంచీక్లాసుకే పోయేవాళ్లం—మా ఊళ్లో టిన్ రేకుల థియేటర్ లో, నేల, బెంచీ, మూడే క్లాసులు—ఇంక హాలుగురించి వర్ణన అనవసరం. సహృదయులు ఊహించుకోగలరు. మాకు ఏ సినిమా అన్నది ముఖ్యంకాదు. ఏవో బొమ్మలు కనిపించడం ముఖ్యం. ఆ బొమ్మలు చూస్తే మా కేవో ఆలోచనలు అందుతో సంబంధంలేనివి వచ్చేవి. దానిమీద చర్చలు. సరదాగా కొన్ని క్షణాలు ఒకరి సాహచర్యంలో ఒకరు కాలం గడిపేందుకు వెళ్ళేవారం.

ఆనాడు నే వెళ్లేసరికి అంతా సమావేశమై ఉన్నారు. అప్పారావుగారి (అద్దె) ఇల్లు, రెండు గదులు, ముందుకి చిన్న వరండా, సామాన్ల కొట్టూ, గలది. ఒక గది వంటా భోజనాలకి. మిగిలిన గది వారి లివింగ్ రూము, డ్రాయింగ్ రూము, స్టడీరూపము, బెడ్ రూమూ అన్నీనూ. ఇంక మేం సమావేశమవుతే ఇంట్లో ఆడవాళ్లు అంతసేపూ పాపం వంటఇంట్లో కూచోవల్సి వచ్చేది. రెండు మంచాలు ఎప్పుడూ వేసే ఉండేవి. రెండు పరుపులూ, రెండు దుప్పట్లూ ఎప్పుడూ పరిచే ఉండేవి. మేము మా ఘూళికాళ్లతో పాటిమీద సుఖాసీనులయేవారం. రెండు మంచాలకీ మధ్యని ఒక టేబిలు గోడ నానుకుని—దానిమీద కొన్ని కాగితాలు, ఒక చిన్న అద్దం—అదీ, అక్కడి నిత్యరంగం.

అయిందా—ఆరోజు వెళ్లేసరికి మాష్టారూ, అప్పారావుగారూ లంక పొగాకు చుట్టలు ముట్టించి జోరుగా పొగ వదుల్తున్నారు. కృష్ణమూర్తి దీర్ఘంగా ఆలోచిస్తూ కాగితంమీద ఒక పద్యం అల్లుతున్నాడు. ఇంక నాయినప్ప కూచోని ఏవో ఎస్టేటు వ్యవహారాలు, మాటాడుతున్నాడు.

మాలో మాకు ఒకర్నొకరు అదో లాంఛనంగా పలకరించుకోడం కాని, సలాములు కొట్టుకోడం లాటి చాదస్తాలు గాని లేవు. ఎవరువచ్చినా కూచోడం. ఇష్టముంటే మాటాడ్డం. లేదా వింటూ కూచోడం.

కూర్చుంటూ, ఇవాళ సినీమాకి వెడితే ఎలా ఉంటుందన్నాను—అంటూ రూపాయి తీసి టేబిల్ మీద విసిరేసేను. అప్పారావుగారు "బాగానే ఉంటుందీ" అంటూ కృష్ణమూర్తివేపు చూసేరు. ఆ చూపుల అర్థం గ్రహించినవాడై, తప్పేతుందా అన్నాడు కృష్ణమూర్తి—నిశ్చయం అయినట్టే. కాని, రెండో ఆట కింకా రెండు గంటలకాలం ఉంది. ఆ రెండుగంటలకాలం ఇక్కడో లేదా, హాలుప్రక్క నుండే పాణిగ్రాహి హోటలులోనో గడపవల్సిందే.

"మాటలో మాట—సినిమా ఏఁవిఁటి?" అన్నారు మాష్టారు...

"ఏదయితే నేఁవిఁటి పోనిద్దురూ" అన్నారు అప్పారావుగారు—సినిమా ఏదో హిందీది—రామాయణం సంబంధమయినది. లంకాదహనమో, రావణసంహారమో ఏదో సరిగా జ్ఞాపకం నాకిప్పుడు లేదు. ఏదో అలాటిదే—ఆమాట చెప్పేను.

"అయితే...అప్పా!" అన్నారు అప్పారావుగారు — అందుకుంది రంజకం — నాయనప్ప రాకెట్ లా లేచేడు.

"పరాయివాడి చేతబడి వాడింట్లో అన్నాళ్ళ పాటుందా? అందుకీయనగారు యుద్ధానికి బయలేరేడా? పోనీ పౌరుషం కొద్దీ ప్రతీకారం చేద్దామని బయల్దేరేడు బాగుంది. వాడ్ని చంపేడు—బాగుంది. మళ్లా ఆవిడ్ని అగ్ని పరీక్ష ఏదో పెలగబెట్టి క్యారక్టర్ సర్టిఫికేటు అవిడ ప్రొడ్యూస్ చేసేక ఏలుకున్నాడా... పోనీ అదీ బావుందనుకుందాం. అంత విశాలహృదయుడు. ఎవడో ఏదో కూసేడని పెళ్ళాన్ని అడవుల్లో వదిలీసేడా? అదేదో ఆనాడే చేయక పోయేడూ? అప్పుడా జ్ఞానం ఎందుకు లేకపోయింది. నలుగురూ నాలుగు విధాల అనుకుంటారని—పతివ్రతల ..."అని ఈవిధంగా ఆరంభించేడు—దానిమీద అర్జునుడు

కూడా వ్యాఖ్యానిస్తూ ఖండించేరు. ఇలా ఒక అరగంట కాలం చాలా హీటెడ్‌గా వాదోపవాదాలు చెలరేగి ప్రమాదకరంగా తయారయింది పరిస్థితి—అప్పారావు గారు నిజానికి ఆవేశం పొందరు. అతను కేవలం అప్పని ఆవేశపరచి వినోదించడం కోసం ఇదంతా ఆరంభించేవారు. పరిస్థితి 'క్లయిమాక్సు'కొచ్చింది. అప్పముక్కు చెలమలు లేచి పడుతున్నాయి. ముఖం కండగడ్డ అయింది. పిడికిళ్లు బిగించేడు.

అకస్మాత్తుగా మాష్టారు లేచి టేబిల్ మీద గుద్దేరు—అప్ప నోరు ఆగిపోయింది. మాష్టారెప్పుడూ అలా జోక్యం కలుగజేసుకోలేదు. అందుకు కొద్దిగా ఆశ్చర్యపోయేం.

"నాదొక చిన్న మనవి—" అన్నారు అతి సున్నితంగా—అని చిరునవ్వు నవ్వేరు. అప్ప ఆవేశం సగం తగ్గిపోయింది. "ఏఁవిటా మనవి" అన్నాడు. "ఇవాళకి మీవాదం ఆపండి" అన్నారాయన—"అదా—మనవి" లేచేడప్ప.

"మన కింకా ఒక గంట ఉందికదూ—ఏముంది ఒక్కపావుగంటే—చిన్న కథ ఒకటి చెప్తాను—వింటారా? ఏం అప్పా—వింటావా?"

"కానీండి" అన్నాడప్ప—గత్యంతరం లేక.

మాష్టారు గాఢంగా ఆలోచించేరు. ఆనక, జేబులోనుంచి పెద్ద ఇత్తడి 'లైటర్' తీసి చుట్ట ముట్టించేరు. ఆయన చుట్ట ప్రతిఐదు నిముషాలకీ ఓసారి ఆరిపోతుందిలెండి—పొగ లాగి వదుల్తూ అన్నారు సీరియస్‌గా—(ఆయనఏదన్నా సరదా పుట్టించేవీ, హాస్యాన్నిచ్చే సంగతులూ మహా గొప్ప సీరియస్‌గా చెప్తారు) "అప్పా! ఏ సంగతన్నా నిశితంగా మనసులో ఆలోచించకుండా, పూర్తిజ్ఞానం లేకుండా అంత తేలిగ్గా మాటాడకూడదయ్యా."

"ఏవిటి నేను తేలిగ్గా మాటాడేసేను?...పతివ్రతలు...."

"ఔను. ఆ సంగతే నేనిప్పుడు చెప్తున్నాను—నే చెప్పబోయే సంగతి విన్నాక అర్థం అవుతుంది. ఇది మీ ఇరవయ్యో శతాబ్దంనాటిదే. అయినప్పుడు అప్పా ఆనాటి సంగతి ఆలోచించు. ధర్మం నాల్గు పాదాలూ నడిచే రోజులవి. ఆనాటి వాతావరణమే వేరు...... ఆ నిర్మలమయిన వాతావరణంలో అటువంటి శక్తిగల స్త్రీలుఉన్నారంటే ఆశ్చర్యపడవల్సిందేమీ లేదు..."

"పాతివ్రత్యం అంటే నవ్వు రావడం నీ తప్పు కాదు. ఏవో బలవత్తర కారణాలవల్ల వాళ్లు పతివ్రతలయేరంటావ్. అప్పా ఒక్క సంగతి జ్ఞాపకం ఉంచుకో...స్త్రీ శక్తిస్వరూపిణి..."

ఈసారి నాయనప్ప నవ్విన నవ్వుకి గదంతా కంపించింది. ఆ నవ్వుతున్న అతని ఆకారాన్ని చూసేసరికి నాకు నవ్వాగిందికాదు. మాష్టారో చిరునవ్వు పారేసి, చుట్ట ఆష్‌ట్రేమీద పడేసి అన్నారు—

"అనురాగం అనేది ఒక శక్తి—ఆ శక్తి స్త్రీలో కలిగినప్పుడు ఆమె శక్తిస్వరూపిణి అవుతుంది. ఆ అనురాగం దేవుడిపట్లే కాని, తన భర్తపట్లే కాని..."

"మరో మగాడిపట్లే కాని" నాయనప్ప అందిచ్చేడు......

"సరే...మరో మగాడిపట్లే కాని, కలిగిందంటే, ఆ శక్తి విజృంభించిందంటే, స్త్రీలో అహం అన్నది చచ్చిపోతుంది......స్వార్థం నశిస్తుంది...ప్రాణాలను కూడా లెక్కచెయ్యదు అవసరం వస్తే. భర్తపట్లా, దైవంపట్లా ఆ అనురాగం, ఆ త్యాగదీక్ష కలిగి ఉన్న స్త్రీని పతివ్రత అన్నారు...ఒప్పుకుంటావా?"

నాయినప్ప ఈసారి అంతగట్టిగా నవ్వలేదు—కాని—

"ఈ కబుర్లకేంలెస్తురూ మాష్టారూ" అన్నాడు.

"పూర్తిగా వినుమరి—ఏదీ అప్పారావుగారూ ఓ చుట్ట."

అప్పారావు గారిచ్చిన చుట్ట ముట్టించి పొగ వదుల్తూ చెప్పుకుపోయేరు మాష్టారు.

"నే చెప్పబోయే సంగతి అంత పెద్దదికాదు. చాలా చిన్నది, నాలుగు ముక్కల్లో చెప్పివచ్చు. అయినా మీరు సరీగా గ్రహించేందుకు మరో రెండు ముక్కలు తగిల్చి చెప్తాను." అంటూ చెప్పేరు మాష్టారు.

"అతను నాకు బాగా తెల్సు—అయినా స్నేహితుడనీ చెప్పలేను. స్నేహితుడంటే నా అంచనా ప్రకారం వేరు. నా విలువల ప్రకారం చూస్తే నిజానికి మీరెవరూ స్నేహితులుకారు నాకు—స్నేహం—స్నేహధర్మం—అదంతా ఒకపద్ధతి. నాకు స్నేహితుడని చెప్పుకోదగ్గవాడు ఒకే ఒక డుండేవాడు. అతనిప్పుడు

లేదు. శరీరాలే భేదం మా ఇద్దరికీ-సరే ఆ వ్యవహారం వదలండి—

"అయితే—అతను నాకు బాగా తెలుసు—అంటే అతని ఇంటికి నేను తరచువెడుతూ ఉండే వాణ్ని—ఒక విధంగా దూరపు చుటం కూడానూ అతడు—ఏదో బాదరాయణ సంబంధం.

"ఓ—ఉండేవాడు ఆరడుగులు దగ్గర దగ్గర ఎత్తు—ఎత్తుకుదగ్గ లావు. నవమోహనా కారుడని అనను కాని, ఆ ఆరోగ్యం, ఆ హుషారు ఒక ప్రత్యేక ఆకర్షణ—అంగులో అందం ఉండేది. ఎప్పుడూ నీట్ గానూ, 'టిప్ టాప్' గానూ ఉండేవాడు. టెన్నిస్ ఆడేవాడు—జూదం ఆడేవాడు.—తాగేవాడు-పెళ్లాం ముందే నిర్మొహమాటంగా-అతగాడి వయసు అప్పుడు దరిదాపు 30 ఏళ్లు—

"ఆవిడ నిజంగా బహు చక్కనిది—"

"ఏవిడ?" అన్నాడు అప్ప—

"ఆవిడే...అతని పెళ్ళాం...23, 24 ఏళ్లుండేవి కాని 18 ఏళ్ళ అమ్మాయిలా కానొచ్చేది. పిల్లలు లేరు మెట్రిక్ ప్యాసయింది. ఇంగ్లీషు పుస్తకాలేవిటి...తెలుగు పుస్తకాలేవిటి తెగచదివేది. నా పని ఆవిడకి పుస్తకాలు సరఫరా చెయ్యడం—సరఫరా చెయ్యలేక చచ్చేవాడ్ననుకో—అయినా అందులోనూ ఉండేది లెండి ఆనందం..."

"ఊఁ? ఉండేది ఆనందం" దీర్ఘాలు తీస్తూ అన్నాడు కృష్ణమూర్తి—

"ఆ...ఉండేదయ్యాక ఏ' ఉండేది" అని మాష్టారు పకపకా నవ్వేసేరు.

"నాతో చనువుగా మాటాడేదావిడ—ఆవిడ నుండి ఆ చిరునవ్వందుకుంటేనే చాలు ఇంక చచ్చిపోవచ్చనుకోండి. మరింక బతుకులో ఆశించవల్సిందింక లేదు."

"మీ రింకా బ్రతికేఉన్నారు" అన్నాను నేను.

"ఉన్నాను—ఈ వెధవ బతుకు బతుకుతూ—" నిరాశగా కుర్చీకి చేరబడ్డారు మాష్టారు—

"ఎక్కడున్నాం—ఆఁ—నేనెప్పుడు వెళ్ళినా అప్యాయంగా మాటాడేది. ఆకళ్ళనిండా నవ్వలే...ఆ ముఖమల్లా ఆనందమే...ఆ పెదవులనిండా జీవమే—లతలా నాజూకుగాఉండేది—గులాబీరంగు పర్చుస్న జుత్తు విరబోసుకుంటే నల్లని మేఘాలు ఆకాశాన్నీ, చంద్రుణ్ణీ కప్పేసినట్టుండేది—అంతజుత్తు...కాని ఏం లాభం..."

"ఏఁవీఁ...ఏమయింది."

"అవన్నీ అతడికోసమే."

"అదా మీ గుసుపు...ఏంలాభం అంటే ఏమో అనుకున్నాను" అన్నాడు అప్ప మాష్టారి భుజంతట్టి.

"అందుకే వాడూ ఏమీ పట్టనట్టే ఉండేవాడు, నాతో ఆవిడ ఎంత చనువుగాఉన్నా—అంత విశ్వాసం వాడికి తనలో—

"అతగాడి నిబ్బరం చూస్తే మండుకొచ్చేది—అయినా ఎందుకు మండుకురావాల్లెండి—అతడూ అలా ఉండక ఏమాతాడు...ఆమే అలాఉంటే..."

"ఎలా ఉంటే?"

"అతగాడు తన ఎదురుగా ఉంటేచాలు!, చూసేవాణ్ణికదా,—తన అందాన్నీ జీవాన్నీ, ప్రేమనీ, ఆరాధననీ, నవ్వులనీ, వెలుగునీ, సర్వస్వాన్నీ ఆకళ్లలో ఆరెండు కళ్ళలోనూ ఇమిడ్చి అతణ్ణి తీసుకోమనేది.—వాడి పాదాలముందు అర్పించుకునేది...మరి—వాడలావుండక ఎలా ఉంటాడు..."

"అప్పా ఈర్ష్యపుడుతోందా!" అన్నాడు కృష్ణమూర్తి—నాయినప్ప మాటాడలేదు. సీరియస్ గా ముఖంపెట్టి కూచున్నాడు—

"శుభ్రమయిన ఇంట్లో ఉండేవారు—ముప్ఫయి కామోసు అద్దె—ఇంటినిండా సోఫాలు—వాళ్ళ పడకగది స్వర్గమే - అంతశ్రద్ధతో ఆ ఇల్లలా ఉంచేది. అతనిజీతం మళ్ళీ ఎంతో కాదు — 150/-- 160/-- ఆ ముక్కని ఉండేది — ఎగ్జిక్యూటివ్ ఉద్యోగం, ఏవో ఆ కంట్రోళ్లకీ సంబంధించినదేదో...

"అతను నాకు తమ్ముడువరస — అందుకామె నన్ను 'బావగారూ" అని పిలిచేది - ఏవో కవుల గురించి? రచయితల గురించి వారి రచనలగురించి మాటాడేది — ఆవిడకి సంస్కృతం బాగావచ్చు - అతగాడి కివన్నీ చెవిటివాడిముందు శంఖంలాటివి - అందుకు నేను దొరికే నావిడకి —

"అతనికీ సంగతులంటే ఏమీ సర్దాలేదండీ...అతనితో ఇవి మాటాడ్డం అతనిని అనవసరంగా బాధపెట్టడం తప్ప మరింకేమీ కాదు..." అనేది -

"ఔను — ఎందుకుంటుందీ ఉమర్ ఖయ్యామ్ చెప్పినట్టు నిషా ఇచ్చేని మూడూ ఉంటూ ఉండగా - పుస్తకం బదులు పేక అనుకోండి ... ఏమయితే నేం" అనేవాడ్ని కసిగా -

"చిన్నబుచ్చుకోడం పోయి గలగలా నవ్వేసేది ఆ మాటలకి -

"ఇంక వారిద్దరిమధ్యా ఎలా ఉండేదీ అంటే, చెప్పగలిగిందేదో చెప్పేను - అనడంటే ఆమెకి కలిగే భావం చెప్పేను—ఆసంగతి క్షుణ్ణంగా అతడికి తెల్సు; అలానడిచేది.

"ఆమె ఏదీకోరకుండానే అతను తెచ్చి పడేసేవాడు— చీరలేంవిటి — నగలేంవిటి ... అలా అనిఅదంతా ఆమెమీద అపారమయిన ప్రేమవల్లనని నేనెన్నడూ అనుకోలేదు — అందులో అతడొకరకమైన ఆనందం పొందేవాడనుకుంటాను. అదంతా తన అహాన్ని తృప్తిపరచడంకోసం అని నా నమ్మకం.

"అవన్నీ పెట్టెలలో తుప్పుపట్టవల్సిందే — ఆ అలంకారాలేవీ ముట్టదికాదు, అతి నిరాడంబరంగా దుస్తులు వేసుకునేది -- అప్పుడే ఆమె రెట్టింపు అందంతో కానొచ్చేదనుకోండి - ఆసంగతి ఆమెకు తెల్సనుకుంటాను.

"సరే - అదంతా బాగానేఉంది -- అప్పటికి. యుద్ధం ఆఖరయిపోతుం దన్నమాట. మరో నాలుగయిదు నెలల్లో -- నాకక్కడ్నించి బదిలీ అయిపోయింది - అక్కడికి రెండువందల మైళ్ళ దగ్గర దగ్గరుంటుంది నేను పోబోయే కొత్తఊరు - ఆఖరి రోజున వారింట్లోవిందు - రాత్రి - మేంముగ్గరంవేం- అతగాడు రావడం ఆలశ్యమయిం దనుకోండి — వచ్చేడు - కాస్త చుక్క వేసుకున్నాడు — నన్నుకూడా వేసుకోమని బతిమాలేడు. నా పంక్తిని కూచున్నాడు. ఎటో మళ్ళాపోయేడు.

"ఆ రాత్రి అన్నానావిడతో—అతన్ని కాస్త అదుపులో పెట్టమని—మరీ అతి అయితే అతని ఆరోగ్యం చెడడం, ఇద్దరి సామరస్యం దెబ్బతినడం, ఇలాటివి జరగవచ్చని చెప్పేను. ఆవిడ నవ్వేసి ఊరుకుంది. ఆవిడ ఉదాసీనతచూస్తే నాకు కష్టంవేసింది. ఎందుకయ్యా వేసిందీకష్టం అంటే వేసిందిమరి. ఉండబట్టలేక అనీసేను—"చూడూ—నేనిలా ఉంటున్నానని ఇంకోలా అనుకోకు, నాకొకటి బాగా అనుమానం... అతను నీపట్ల అవిశ్వాసంగా ప్రవర్తిస్తున్నాడేమోనని"

"'అంటే?'--అందావిడ నవ్వుతూ. నాకు కోపం ఒచ్చింది, చెప్పొద్దూ—తెల్సే ఆ ప్రశ్న వేసిందని-

"అంటే ఎవరి వెంటేనా పడుతున్నాడని నా అనుమానం—ఇంకా అర్ధంకాలేదా?" అన్నాను కోపంవచ్చి.

"'ఆయనలాటివారు కారు—మీరెన్ని చెప్పినా నే నమ్మను...' అంది. అయ్యా! ఇంక అలాటి ఆడదానికి ఏంచెప్పి ఏం లాభం. ఏమీ లేకుండా నే అనుమానపడడం భార్యల స్వభావమే—అటువంటిది అంత ఢంకా బజాయించి నే చెప్తున్నా నమ్మని స్త్రీని ఇంక దండం పెట్టి వదిలీవచ్చు.

"నే వెళ్ళిపోతున్నానని కళ్ళ నీరు నింపుకుంది పిచ్చిపిల్ల—ఆవిడ చేతుల్ని నా చేతులలోకి తీసుకుని అన్నాను "నేను నీ మేలుకోరేవాళ్లలో ఒకణ్ణి—ఎప్పుడన్నా నా అవసరంవుంటే నాకు కబురు చెయ్యడం మరవకు" ఆఖరికి మనసు ఉండబట్టలేక ఇది కూడా అనీసేను. "రోజూ నీ నవ్వుముఖం కనిపిస్తూ ఉంటే నాకెంతో తృప్తిగా ఉంటూ ఉండేది..."

"సరి, నేను ఆ ఊరు ఆ మర్నాడే వదిలి వెళ్ళిపోయేను. కొన్నాళ్ళపాటు ఈనోటా ఆనోటా వాళ్ల సంగతి తెల్సుకునేవాణ్ణి. ఆనక మరి నాకింకేం తెలీలేదు. అప్పటికి యుద్ధంకూడా అయిపోయింది మూడేళ్లు గడిచిపోయేయి. నేనూ నా గొడవలలో పడిపోయేను ఈ మూడేళ్లలోనూ. ఇంక బయట అందరూ ఎలా ఉన్నదీ తెలియనిస్థితిలో పడిపోయేను. మా వాడికి టైఫాయిడ్ చాలా ప్రమాదం చేసింది. దానికితోడు ఆఫీసుపని ఒత్తిడి ఇంతా అంతా కాదు. ఇంట్లో మందులు ఇత్యాది గొడవ. ఇలా మూడేళ్లు దొర్లిపోయేయి. పెళ్లయీ అవడంతోటే పిల్లల్ని కనీసే మన గుమస్తా బతుకుల సంసారాలు,—చీదర, నరకం అనుకోండి—"

ఇక్కడ మాష్టారుకథ ఆపి కొంచెం చుట్ట ముట్టించుకున్నారు.

"ఆ... ఏం - జరిగిందీ...ఔను ... ఓరోజు పొద్దుటే ఎఱ్ఱ సైకిలు ప్రత్యక్షమయింది. మన బ్రతుకుల్లో టెలిగ్రాంలు అందుకున్న క్షణాలు చాలా

విలువయినవి. మన బతుకులని ఎందుకంటున్నానంటే పెద్దపెద్ద వాళ్ళందరికీ టెలిగ్రాంలు రోజువారీ వస్తూనే వుంటాయి. మనకిమాత్రం అత్యవసర పరిస్థితి గానో, అత్యంతప్రమాద పరిస్థితిగానో తప్ప రావు. అందుకు అన్నా నామాట. అందులో 'అర్జంటుగా' రమ్మని ఉంది. దివని ఆవిడ పేరు. నాకు ఆశ్చర్యం, ఆందోళన కలిగేయి.

ఇన్నాళ్ళూ ఏవిధమయిన సమాచారమూ, ఉత్తర ప్రత్యుత్తరాలు లేకుండా ఒక్కసారిగా టెలిగ్రామ్ ఇలాటిది వస్తే ఎలా అనిపిస్తుందో అలా అనిపించింది. సెలవు దొరికేసరికి నా తాతలు దిగొచ్చేరు. రాత్రల్లా రయిల్లో, అతగాడేం అత్యాచారం చేసేడో, ఏం కొంప మునిగిందోనని బెంగగానే ఉంది. ఈ ఊరు చేరేటప్పటికి తెల్లవారిపోయింది బాగా. స్టేషన్‌దగ్గరే ఇడ్లీ, కాఫీ పుచ్చుక బయల్దేరేను. స్టేషన్‌కవాళ్ళి ఇల్లు ఒకమైలు. చేతిలో సంచీయే కాబట్టి నడిచేద్దామని కాలిని బయల్దేరేను. ఓ ఫర్లాంగుదూరం వెళ్ళేసరికి. కుటుంబరావు ఎదురయ్యేడు. కుటుంబరావు కక్కడే తాలూకాఫీసులోపని. ఉద్యోగం అయినప్పట్నుంచి అక్కడే ఉంటున్నాడు. అప్పటికి40 ఏళ్ళు. "ఏమోయి ఏంవిటిలా ఊడిపడ్డావ్' అన్నాడు. అతగాడికి తెలీకుండా ఉంటుందా అని ఆత్రంగా సంగతంతా చెప్పేను. వాడు ఆశ్చర్యపోయేడు. అంత ఆశ్చర్యం లోనూ ఒక చిరునవ్వు నవ్వి "ఇప్పుడా నీకు తెల్సింది" అన్నాడు. నాకు గాభరా పుట్టింది. "ఏంవిటి తెలీడం నాకేమీ ఇంకా తెలీదు" అన్నాను. "ముందు పద. కాఫీ తాగుదాం" అన్నాడు. "కాఫీకేంవిటి కాని ముందు ఏం జరిగిందో చెబ్దూ" అన్నాను. "అప్పుడే అంతా అయి రెండునెలలయింది. వాళ్ళకి దూరపు బంధువువి...దగ్గిరి స్నేహితుడివి...ఇప్పుడా నీకు తెలుస్తా" అన్నాడు. "నాకు తెలీదయ్యా దేవుడా! అదేదో చెప్పి ఏడుద్దూ ముందు" అన్నాను. "కాఫీ తాగుతూ చెప్తా పద" అన్నాడు. అతగాడి సంగతి నాకు బాగా తెల్సు. కాఫీ పడితే నేకాని ఏంవీ పెగల దన్న నిర్ణయాన్నికొచ్చి, పద అన్నాను. కాఫీ అంటే ఉత్తి కాఫియేకాదు. అన్నీ స్వీకరించేక కాఫీ చవి చూస్తూ అన్నాడు "ముప్ఫయిరూపాయల అద్దెయిల్లు, ఇంటినిండా ఆ సోఫాలు, తివాసీలు, అద్దాలు, ఆబోట్లు నగలు ... ఆరేడియోలు, తాగుడికీ, జూదానికీ ముండ లకీ, డబ్బు అన్నీ ఎక్కడి దనుకున్నావు కదూ"—ఆ నిముషం కుటుంబరావుని చూస్తే పురుగుని చూసినట్టుగా అనిపించింది. ఏదో ఓ జవాబివ్వాలి. "వాటి సంగతి నేను ఏనాడూ ఆలోచించలేదు" అన్నాను. "ఆలోచించలేదూ?ఎందుకయ్యా ఈ కబుర్లు. తెచ్చే 150 జీతంలోనూ ఇవన్నీ ఎక్కడివని ఆలోచించలేదూ?"సరే.ఏమయిందో చెబ్దూ." "అదికాక ఇరవైపాతిక వేల రూపాయల క్యాషు...ఎలా ఒచ్చిందంటావ్ ఇదంతా" ఇంక లాభంలేదని "ఎలా ఒచ్చింది?" అని ఎదురు ప్రశ్న వేసేను. "ఇవాళ ఫైనలు హియరింగు తీర్పు కూడా ఇవాళే చెప్పేయొచ్చు. తీర్పేమవుతుందో ఆనాడే అందరికీ తెల్సులే."

"నాకు చెమట్లు పోసేయి. ఫైనల్ హియరింగేమిటి తీర్పేమిటి చెప్పమన్నాను.

"దొంగతనంఎన్నాళ్ళుదాగుతుందోయి. భగవంతుడన్నవాడొకడున్నాడంటావా లేదంటావా? ఎప్పుడో ఒకప్పుడు పట్టుబడక తప్పదుకదా..." ఇది చెప్తున్నది తాలూకాఫీసు గుమాస్తా కుటుంబరావు. అర్ధకీ, రూపాయకీ కక్కుర్తిపడే కుటుంబరావు. "అన్నాళ్ళు ఆ డిపార్టుమెంట్లో, ఆ ఉద్యోగంలో ఉండి, షావుకార్లలో కల్సిపోయి, ప్రజల కళ్ళు కప్పి దోచుకుంటే, ఎన్నాళ్ళు సాగుతుంది బాబూ నాటకం ఎలాగో తెల్సింది. అంతా బట్టబయలుగా కనుపిస్తూఉంటే ఇంక తెలీడాని కేముంది - ఎక్కడిది? ఎలా ఒచ్చింది అన్నారు...ఇంకేముంది. 'ఏంటీ కరప్షను ఆఫీసర్లు' పోలీసులు, వెంటనే అరెస్టు-అనక అసుంద్రావు గాడు లేడూ? వాడు భుజా లెగరేసుకుంటూ వెళ్ళి బెయిల్ మీద విడిపించుకొచ్చేడు." నాకంతా అర్ధమయింది. కాని ఒకటే వింత అనిపించింది. ఈ ఇచ్చే టెలిగ్రాం ఆనాడివ్వక ఈరోజు ఎందుకిచ్చిందా ఆమె అని. అతడి కాఫీ పూర్తయింది. లేచేను. కుటుంబరావు ఇంకా చెప్పుకుపోతున్నాడు—"ఏవీ హోపు లేదు. సంవత్సరం ఖాయం. గడించిందేదో సర్కారువారు పుచ్చుకోడం అలా ఉండగా ఇంక జరిమానామాట దేవుడెరుగును. వాళ్ళ ప్లీడరన్నమాటలే అవి. అయితే ఏవిటి, పడుతున్న తాపత్రయమల్లా, శిక్ష కాస్త తగ్గించడానికి" నేనింక అతగాడి మాటలు వినదలచుకోలేదు. బిల్లు చెల్లించి, "అయితే ఒస్తానోయి" అని బయల్దేరేను. "అప్పుడే? ఉండవోయి కాస్త...కిళ్ళీ అదీ వేసుకుని—"

ఇల్లు మామూలుగా ఆనాటిలానే ఉంది. అయితే ఏవిటో ఎందుకో కళావిహీనంగా ఉందనిపించింది. కేవలం నేను నా మనస్సులో అలా అనుకోడంవల్ల అలా అనిపించి ఉండవచ్చు. అది వేరే సంగతి.

ఇంట్లో ఏవీ అలికిడి లేదు. ఆవిడ ఒక సోఫాలో కూర్చొనిఉంది. కుడిచేయి చెక్కిలికి ఆన్చి సోఫాని ఆనుకుని ఆలోచిస్తోంది.

నన్ను చూడగానే ఎంతో సంతోషంతో నా చేతులు తన చేతుల్లోకి తీసుకు పలకరించింది. ఆవిడ బాగా నీరసించింది. అది మరి సహజమే. ఎంత నీరసించినా ఆ ముఖంలోని కళా, కాంతి, ఒక రేఖ ఎక్కువయితే అయేయేమో కాని తగ్గలేదు. మానేరూ, మనుష్యులు ఉపవాసమున్నా, ఏదన్నా వ్రతం పూనినా, నీరసంగా ఉన్నా ముఖంలో ఒక తేజస్సు ఉంటుంది-అలా.

ఆవిడ నాకు ఈ సంగతి చెప్పలేదు. నా ముఖంలోకి నిదానంగా చూసింది. ఎందుకో, నే నిప్పుడు మీకు చెప్పలేను. కాని చూడండీ—ఆవిడదీ మహా చికాకయిన పరిస్థితే. ఎలా చెప్పడం అన్నది. ఆవిడకు కష్టం కలిగించకుండా నేనే అన్నాను. "కుటుంబరావు దార్లో కల్సేడు."

ఆవిడ ముఖం చిన్నబుచ్చుకుంది. సహజమే. నేను అప్పటిమట్టుకు ఏమీ ప్రశ్నలు వెయ్యలేదు. నే వస్తానని తెల్సున్నా ఉంది, పలహారం తెచ్చిపెట్టింది. తప్పుతుందా మరి. కాదన్నా ఆవిడ వింటుందా.

"ప్రేమపూరితమయిన హృదయంలో, లావణ్య హస్తాలతో ఇచ్చిన నైవేద్యం ఏ దేవుడు కాదనగలడు?" అని అందిచ్చేడు కృష్ణమూర్తి.

"ఏవన్నా అంటారు కవులు. ఈ కాలంవాళ్ళు మీకు అన్నిటికీ ఫ్రాయిడే గుర్తొస్తుంటాడు. సరే—సరే. దానికేం—అదలా ఉంచండి.

'కాఫీ తాగుతూ ఉండగా ఆవిడంది - "నేను ఇన్నాళ్ళూ మీకు ఏ సంగతీ తెలియజెయ్యక ఈనాడు మిమ్మల్ని రమ్మనడం 'ఏవిటిది? అనిపించిందికదూ?'

"నా మనసులో ఉన్నది సరిగా గ్రహించి చెప్పిందావిడ. నే జవాబిచ్చేలోగా అంది—"ఆనాడు మీరు వచ్చి మాత్రం ఏం చేసి ఉండగలరు. అయితే ఈనాడు మీ కెందుకు కబురంపేనని అడుగుతారేమో-ఎందుకో చెప్పనా? నా కేదో మాటలలో చెప్పలేని భయం పట్టుకుంది ఈ రోజంటే—ఈ రోజు నెదుర్కొ నేందుకు నాకు ధైర్యం చాలటం లేదు. మీరు దగ్గరుంటే... అందుకు...అర్థమయిందా?" కాస్త ఊరుకుని అంది. "ఎవరేమనుకున్నా ఆయన కేదో చెప్పలేని ధైర్యంగా ఉంది. ప్లీడరుగారు కూడా నాకెంతో ధైర్యాన్ని చెప్తున్నారు...అయినా యెందుకో చాలా ఇదిగా వుంది." ముఖం తిప్పుకు, కన్నీళ్లు తుడుచుకుంది.

"నే నేంవని ఓదార్చేది—ఆ స్థితిలో ఆవిడ్ని ఓదార్చేందుకు సరయిన మాటలంటూ వున్నాయా? నేను చాలా విచారపడుతున్నాను సుమా. అన్నవిగంగా ముఖం పెట్టే కూర్చోడం తప్పించి నే నేమీ చెయ్యలేక పోయాను. కొంతసేపు పోయేక అన్నాను—

"నావల్ల సహాయం ఉన్నా లేక పోయినా ఇన్నాళ్ళు నాకీ సంగతే తెలియజెయ్యక పోవడం..."

"మీరలా అంటారని నాకు తెల్సు. ఈ సంగతి తెలుస్తే మీరు ఎంత బాధపడతారో ఊహించకోలేక పోయే ననుకోకండి. అందుకని—" అతని గురించి అడిగేను. అంటే అతని మానసిక స్థితిని గురించి—"అతను ఇంటికి రావడమే అరుదై పోతోంది. అతను అంతగా బాధపడి అధైర్యపడి పోయేరనుకోకండి. లాయరుగారి కారొస్తుంది. తప్పకుండా మరీమరీ రావాలని చెప్పేరు. నాకెందుకో వెళ్ళాలని లేదు. అక్కడ వుండలేను." మనస్సు అంత ఆందోళనగా ఉన్నప్పుడు వెళ్ళడం మంచిదికాదని, వెళ్ళవద్దనీ ఆవిడకు చెప్పేను."

మాష్టారుకు కుర్చీకి చేరబడి కళ్ళజోడు తీసి టేబిల్ మీద పడేసేరు. కళ్లు రాచుకుంటూ అన్నారు:

"ఇప్పుడల్లా చెప్పుకొచ్చిం దొక ఎత్తు, ఇప్పుడు చెప్పబోయేది కొద్దిపాటి ఒకయెత్తు. ఒక విధమయిన వాతావరణం మీ మనసుల్లో కలిగేందుకు యిదంతా చెప్పేను. నే చెప్పబోయేదేమంటే, ఒక అనుకోని, భయంకరమయిన, సందిగ్ధ స్థితిలో స్త్రీ చిక్కుకున్నప్పుడు అది అనుకోకుండా, ఆ పరిస్థితిలో ఆవిడ ఎలా ప్రవర్తించిందీ అని. లోకంలో, స్త్రీలలోనైతే నేం, పురుషులలో నయితే నేం, సర్వ కాలాలలోనూ వివిధ మనస్తత్వాలు గలవారు ఉండివున్నారు. మాట వచ్చింది కాబట్టి చెప్తున్నా. ఇది ఇరవయ్యో శతాబ్దం కదూ. పతివ్రత అంటే నీకు నవ్వొచ్చింది కదూ. ఐతే నే చెప్పబోయే పరిస్థితిలో నువ్వన్న ఆర్థిక బానిసత్వం

ప్రశ్న రాదు. పతివ్రత అనంగానే నీ కళ్ళకి తెల్లారు జామునే లేచి, భర్త పాదాలకి దండం పెట్టి, చన్నీళ్ళ స్నానం చేసి, మడి కట్టుకుని, పరపురుషుడు కానొస్తే కళ్ళు మూసుకుని, భర్త దేవుడని గుడ్డిగా నమ్మి, పువ్వులు పత్రి తెచ్చి భర్తని పూజచేసే స్త్రీ కళ్ళకి కడుతుంది కదూ? అలా ఆలోచించటం మానెయ్యి. రక్తం, మాంసం, ఎముకలే కాకుండా పాపిష్టిదేవుడు మన సన్నది కూడా ఒకటిచ్చాడుగా. దాన్నే హృదయమను ఏమను. 'ఎక్సెంట్రిసిటీ' (వ్యగ్రత) అంటారే, అది ప్రతి వ్యక్తిలోనూ ఉంటూ వుంటుంది. ఎంతో అనురాగం, ఎంతో భక్తి, దీక్ష పూనటం, కక్ష, కసి ఇవన్నీ వ్యగ్రతలే. ఆర్థిక బానిసత్వం కూడా వుంది. లేకపోలేదు. కాని అందరికీ అది వర్తించదు.

అచంచలమైన అనురాగ విశ్వాసాలు, అనే 'ఎక్సెంట్రిసిటీ' భర్తపట కలిగిన స్త్రీని పతివ్రత అన్న పదంతో పిల్చేరు మన పూర్వులు—ఇదంతా ఎందుకు గొంతుక చించుక చెప్తున్నానంటే నేనా సంఘటనని ఎలా అర్థం చేసుకున్నానో అలా అర్థం చేసుకోగలరో లేదోనని..."

"మరో అరగంటే ఉంది పిక్చర్‌కి" అన్నాను.

"పోనిద్దూ వెధవ పిక్చరు" అన్నాడు కృష్ణమూర్తి.

"ఇంత బొత్తిగా ఓపిక లేకపోతే ఎలా, కవులయ్యేండి—మరింక నే చెప్పవల్సింది టూకీగా చెపేస్తాను."

"అంటూనే మరో పావుగంట" అన్నాడు పార్థుడు.

"పదకొండుకల్లా కారొచ్చింది- నేనూ ఆవిడా బయల్దేరేం—ఆవిడ ముఖం పాలిపోయిఉంది. పెదవులు వణుకుతున్నాయి. తనలోతను ఏదో మెల్లిగా అనుకుంటోంది. రెండు చేతులూ గట్టిగా కలుపుక కూర్చుంది—ఏమంటే అనుకోండి కాని, ఆవిడ స్థితి చూసి నా మనసు తరుక్కుపోయింది."

"అతగాడిమీద కోపమూ వచ్చింది" కృష్ణుడన్నాడు.

"ఆవిడ మనసుని ఆ స్థితికి దించేందుకు వాడికున్న హక్కేమిటనిపించింది. ఆవిడని మీ రెవ్వరూ చూడలేదు—ఊహించుకోగలరో లేదో— అటువంటి స్త్రీని చూడగలగడం జన్మానికోసారి. అటువంటి స్త్రీ ముఖంమీది నవ్వు జగమంతకీ వెలుగే—ఒక్క కన్నీటిబొట్టు రాలితే సర్వనాశనమౌతుందనిపిస్తుంది... ఆ స్త్రీ పాదాలముందు మోకరిల్లాలనిపిస్తుంది చూడగానే. ఎటువంటివాడికన్నా.

"సెంటిమెంటులో పడిపోకండి."

"సెంటిమెంటే మహాశయా! మన బతుకులో అడుగడుగునా అది కానొస్తుంది. అది లేనిది మన బతుకులు ఖాళీ- జంతువుల్లో కూడా కానొస్తుందే—మాటవరసకి కుక్కని తీసుకోండి—అదెందుకంత విశ్వాసంగా ఉండాలి? ఈవిడ అతడిగురించి పడే బాధకి, అంటీఅంటనట్టున్నాడనిపించింది.

"సరే—కోర్టుకి చేరుకున్నాం—ప్రజఉన్నారు రమారమీ ఒక యాభైమంది—మేం వెళ్ళేసరికి న్యాయమూర్తి వచ్చేరు—కేసు నడుస్తున్నది. 'డయాస్'కి ఎదురుగా ఉన్నాడతను. సగుసల మధ్యనుండి దారి చేసుకునివెళ్ళేం. ఆవిడ్ని ఒక కుర్చీలో కూచోమన్నాను—కూచోలేదు. అతగాడికోసం వెలికి ఆఖరికక్కడ చూసింది. ఆ ముఖంలోని భావం ఏమని చెప్పను. ఆ కళ్ళు చెరువులే అయ్యాయి. కుర్చీలో నీరసంగా కూలబడింది. లాయరు, దుక్కలా, పొట్టిగా బొద్దుమీసాలమనిషివచ్చి, ఆవిడ్ని ఓదార్చి, ఏమీ బాధలేదు, ధైర్యంగా ఉండమని చెప్పివెళ్ళేడు—కాని సంగతి సందర్భాలు విచారించగా ఏమాత్రమూ ఆశ ఉన్నట్టు అగుపడలేదు. లాయరు కూడా శిక్ష ఎంత తగ్గినా తగ్గిందే అన్న ధోరణిలో ఉన్నారు.

"ఆఖరు కతగాడ్ని బోనెక్కించేరు—సుక్కపోతులా ఉన్నాడు—ఏవీ నిరసించలేదు, అతని వేపే దీక్షగా చూస్తూ కూచుందామె.

"చెప్పుకోవల్సిందేమన్నా ఉందా?" అని అడిగేరు న్యాయమూర్తి. చేతులు కట్టుకుని టంచనుగా నిలబడి అన్నాడు అతగాడు.

"నేను చెప్పవల్సింది బహు కొద్ది—నేను నిర్దోషిని"—ఆవిడ ముఖం వికసించింది; ఆనందం పట్టలేక వలవలా ఏడ్చేసింది.

"అంత డబ్బు నాదగ్గర ఉండడం సంభవం కాదన్న భావనమీద, ఏదో ఓ విధాన ఈ కేసు నామీద మోపబడింది. నే నీస్థితికి వచ్చేను. ఎక్కడిదీ అన్న విషయంలో నేనింతవరకూ మౌనంగా ఉన్నాను.

కాని ఇప్పుడు... ఈ పరిస్థితులలో—" ఇక్కడ అతని గొంతులోని విశ్వాసం పోయింది. తడబడ్డాడు... మాకేసి, ముఖ్యంగా ఆమెకేసి తీక్షణంగా చూసి... అన్నాడు...

"అది నా భార్యది—"

కోర్టులో గుసగుసలు చెలరేగేయి. ఆమె ఆశ్చర్యంగా చూస్తూ కూర్చుంది. నాకూ ఆశ్చర్యమే అయింది కాని, అదేమీ అంతబలమైన ఆర్గ్యుమెంటులా కానరాలేదు. ఎక్కడిదీ, ఎలా వచ్చిందీ అని అడగరూ మరి?

"ఎలా?" అన్నారు న్యాయమూర్తి—

అతను ఆలోచించేడు—ఎందుకో, ఏదో చెప్పేందుకు సంకోచించి, ఆమె వేపు మరోసారి పరిశీలనగా చూసి, ఔను పరిశీలనగానే, నాకు జ్ఞాపకం ఉంది, చూసి అన్నాడు:

"నేను షావుకార్లతో కల్సి, లంచాలు పుచ్చుకుని నా భార్య పేర వేసి ఉండవచ్చని అనవచ్చు—కాని అది కాదు." చాలా డ్రెమెటిక్‌గా అన్నాడు, కోర్టంతా కలియజూసి—

"అవి యుద్ధంరోజులు—అప్పుడు ఈ ఊరు, ఐదేళ్ళపాటు టెంపరరీగా, ఒక జోన్‌కి మిలటరీ హెడ్ క్వార్టర్సుగా ఉండేది... ఊరినిండా మిలటరీ ఆఫీసర్లే—నీళ్ళలా డబ్బు ఖర్చు చేస్తూ—నా భార్య అందవికారమైనది కాదు. ఇంతకన్న నే చెప్పలేను—కోర్టువారు గ్రహించుకోగలరు"

"అంతా నిశ్శబ్దం—ప్రపంచమే ఆగిపోయింది నాకు—న్యాయమూర్తి కరుడు కట్టిపోయేరు. ఆమె వేపు చూడలేకపోయేను... ఎలా చూసేది... ఎలా చూసేది—"ఇది అబద్ధం—కట్టుకథ. ఎంతమాత్రం నమ్మేందుకు వీలులేదు" అని పబ్లిక్ ప్రాసిక్యూటరన్నారు. నాకు కొంత ప్రాణం వచ్చింది. కాని వాడు తొణకలేదు. "అబద్ధం చెప్పవల్సిన అవసరం లేదు. ఈ విషయం బహిరంగం చెయ్యడం ఎంత ఇష్టం గ్రహించగలుగుతే ఈ అనుమానం వెయ్యకపోను. అయినా నా భార్య ఇందుకు సాక్ష్యం—ఆవిడ ఇక్కడే ఉంది... ఆవిడ నడిగి తెల్సుకోవచ్చు—"

'ప్రపంచం ఎందుకింకా ఉంది ఎందుకు మండిపోలేదు దేవుడా అనిపించింది. అందరి దృష్టీ ఆమె మీద పడింది. ఆమెని కాలుస్తూ... బాకుల్లా అందరి చూపులూ—ఆ చూపులు ఏమిటో నాకు తెల్సు—నిండుసభలోని ద్రౌపది పరిస్థితిలా ఏర్పడింది. ఏ దేవుడు దిగిపడతాడిప్పుడు.

"ఆమె శరీరంలో ఏమీ చలనం లేదు. శిలా ప్రతిమలా అతడ్ని, అలా కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయింది. నాకు అక్కణ్ణించి పిచ్చివాడిలా అరుస్తూ పరుగెత్తుకు పోవాలనిపించింది.

"కొంత తెలివి తెచ్చుకుని ఆమె చెయ్యి నా చేతులలోకి తీసుకుని 'ఆవిజ్జి' పిలచేను—మగో లోకంలో ఉన్నట్టు నా వేపు చూసింది. ఏదో ఆవేశంతో మాటాడేను. ఈ ఘోరమైన అన్యాయాన్ని ప్రతిఘటించమన్నాను. నా మాట లేవీ ఆవిడకు వినిపించినట్లు లేదు.

"పబ్లిక్ ప్రాసిక్యూటరు భీష్మించుకకూచున్నాడు. ఆవిడ బోనెక్కే పరిస్థితి తప్పలేదు. అదీ మంచికే, ఆవిడ ఖండించి చెప్పేందుకు, అనుకున్నాను.

"అప్పా!—ఇక్కడ ఆర్థిక హానిసత్యమన్న ప్రశ్న లేదు. రెండే రెండు మార్గాలామెముందున్నాయి. చదువుకున్నదీ, తెలివైనదీ అయిన ఆమెకి ఆమె పరిస్థితి అర్థమయి ఉండదని నేననుకోను—మొదటిది: ఆవిడ

ఔరా అదేమిటామాట!

సంతానం కుళ్ళి కృషిస్తూ ఉంటే తల్లికి క్షోభ కాదూ?

భారతీ-భారతాంబ బొల్లి, సమస్త చర్మవ్యాధులచే పీడింపబడుచున్న తన సంతానం! కోసం ఎంత విచారిస్తూ ఉందో?

(స్థాపితము 1920 సం॥రం)
ఇదుగో మా చిరకాల అనుభవంతో ఇస్తూ ఉన్న అభయం.

మాకు నేడే వ్రాయండి

రెడ్డి అండ్ కో.,
గోపాలపురం. (తూ గో జి)

కాదన్నదా—అతనికి శిక్ష తప్పదు. ఆపక ఇద్దరికీ సామరస్యం కుదరదు. ఇంతకి తెగించినవాడు అప్పుడు ఏమన్నా చేస్తాడు. ఆవిడ కిచ్చే తక్కువ శిక్ష, ఆవిణ్ణి వదిలి చక్కాపోవడం—అందుకని మళ్ళీ కోర్టుకెక్క మనిషి కాదు ఈవిడ—ఎక్కినా ఫలితం శూన్యం... విరిగిన బతుకులు మిగులు—రెండోది: ఆమె తప్పు కుందా—అతడు విడుదలవడం, మానడం దేవుడి కెరుక-విడుదలవుతాడని ఎక్కడుంది. ఆపక ఇంక ఎన్నో ప్రశ్నలు రావచ్చు...అదలా ఉండగా సంఘదృష్ట్యా ఆవిడ పూర్తిగా బహిష్కరింప బడుతుంది. నీచంగా చూడబడే కులటకన్నా నీచంగా చూడ బడుతుంది...ఈ కళంకభారాన్ని మోస్తున్న ఆమెని తిరిగి స్వీకరించడానికి అతడు వెనుకాడడం ఖాయం—ఒక వేళ అతడు విశాల హృదయంతో చేరదీసినా అది అట్టే కాలం సాగదు. ఆ కళంకాన్ని అవకాశంగా తీసుకుని, ఇతరులు ఆవిడపట్ల యిష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తారు.

అతడిదంతా భరించలేని స్థితికి తప్పకుండా వచ్చేస్తాడు...పర్యవసానం ఆవిడమానాన ఆవిడ్ని వదిలి చక్కా పోతాడు...అప్పుడు ఆ కాపు కూడా లేని ఆమెని తరిమి, తరిమి పీల్చి పిప్పిజేస్తారు మనుష్యులు. అదీ పరిస్థితి—ఇది ఆమెకు తెలుసు—బోనెక్కిన ఆమెకు మొదటి మార్గమొక్కటే శరణ్యమనికూడా—

"తుఫానువల కదలాడి రాలిపోబోయే సగం చీలిన లేత ఆకులా ఉందామె, అక్కడ నిల్చున్నప్పుడు—ఆ ముఖంలో ఆదైన్యం...నిస్సహాయత....వీటితో మిళితమై ఏదో శక్తి...తేజస్సు...అప్పుడామె, నేను రోజూ చూసే ఆమె కాదు—ఆమెను చూడగా—"ఈ పురుగుల్ని ... నీచపురుగులమైన మమ్మల్ని మేముండే ఈ ప్రపంచాన్నీ భగ్గున కాల్చి మసిజేసే శక్తి ఉందమ్మా నీలో!...మసి చెయ్యి!....మసి చెయ్యి!"...అనిపించింది—

మాష్టారు గొంతు తగ్గించి అన్నారు—"కాని ఆశక్తి, తనను తాను భస్మం చేసుకుంది. ఆ మంటల్లో-అతడికి కావల్సిన జవాబిచ్చి తెలివితప్పి పడిపోయింది" కాస్త ఊరుకుని "నా కథ అయిపోయింది" అన్నారు మాష్టారు.

నాయినప్ప ముఖం భయంకరంగా ఉంది. ముక్కు చెలమలు లేచిపడుతున్నాయి. టేబిల్ గుద్ది "ఎక్కడున్నాడు...వాడెక్కడున్నాడు" అన్నాడు. నాయినప్ప ధోరణికి ఆశ్చర్యపోయేం. చెప్పేనుకదూ, ఇట్టే ఆవేశం ఒచ్చేస్తుందని.

"తరవాతేమయింది మాష్టారూ" అన్నాన్నేను.

"తరవా తేమయిందీ అన్నది అప్రస్తుతం. ఇక్కడ ఎంతవరకూ అవుసరమో చెప్పేను..." విచారంగా అన్నారు.

"పోనీ, ఆవిడేమయిందో చెప్పండి" అన్నాను ఉండబట్టలేక.

"అంటే ఆత్మహత్య?"

"కాలిపోయిందన్నానుకదూ?"

"ఆవిడకి మరి తెలివిరాలేదు. అదోక 'స్ట్రోక్' లా వచ్చింది. పలవరింతలు, జ్వరం ఉండుండి కొయ్యబారిపోవడం యమయాతనపడి, ఆఖరికి పది రోజుల తరవాత విముక్తిపొందింది—ఈ పాపిష్టి మన నించి" మాష్టారు కళ్ళొత్తుకున్నారు. ఔను. ఆయన కళ్ళకి కట్టిఉండొచ్చు, ఆమె అమాయికమైన ముఖం.

విడిదికార్ల సంగీతం, సినీమాహాలునుండి వినిపిస్తోంది. మొదటి ఆటవదిలినట్లు సూచనగా.

కాని మేం ఎవ్వరూ కదలలేదు.

ఆర్షరసాయనశాల

ముక్త్యాల, (కృష్ణా)

(స్థాపితము 1925.)

ప్రశస్తాయుర్వేదౌషధముల నిలయము. ఏ మందు కావలసినను మాకు వ్రాయుడు. నమ్మకమైనవి లభింపగలవు.

ఆయుర్వేదభూషణ

వేటూరి శంకరశాస్త్రి,

ఎ. ఎం. ఎ. సి.

Consulting Physician